(కాకినాడ లిటరరీ ఎసోసియేషన్ శతవార్షికోత్సవ ప్రత్యేక సంచిక 1978)

# "సరిగపద-మని-" మోహ(న)రాగం

**ఆరోహణ**

నవ్వింది!

"ఫరవాలేదు! లైన్లో పడ్డట్టే" అనుకున్నాడు మోహనరావు.

సాయంకాలంనించీ ఈమాత్రం నవ్వు దొరకలేదు.

తేరి పారచూసిన వాళ్ళున్నా,

పక్కకి తిరిగి ఉమ్మేసిన వాళ్ళూ,

మరుచటి చూపులో నిప్పు చిమ్మినవాళ్ళూ వున్నారే కాని

ఆదర దరహాసం వెదజల్లినవాళ్లు లేరు!

చంపేస్తున్నారు, రకరకాలుగానూ,

మూడు గంటల టైం వృథా అయిపోయింది. ఇహ కాళ్ళీడ్చుకుంటూ యింటికెళ్ళి పోవలసిందే కాబోలనుకుంటూ వుంటే.

తన పాలిటి దేవతలాగ; నూట ఎనభయ్యేనిమిదో నెంబరు బస్సులో ముందు నుంచి ఎక్కుతూ తనని పరీక్షగా చూసింది, నవ్వింది!

తనూ ఎక్కాలా వద్దా అనుకుంటూ వుంటే కిటికీలోంచి తనవేపు తొంగి చూసింది.

ఎక్కాల్సిని బలమూ వొచ్చింది దాంతో,

ఎక్కలేనివాడే; ఎలాగో యెక్కేశాడా బస్సులో మోహన్రావు.

మోచేతుల్తో జనాన్ని పొడుచుకుంటూ ముందుకి చొచ్చుకు పోయా డభి మన్యుళ్ళాగ.

అభిమన్యుళ్ళాగ వెనకొచ్చేసే వుద్దేశం పెట్టుకుని ఎక్కలేదు.

ముందుకే వెళిపోవాలి ఎంతదూరమైనా ఈ ఎఫయిర్‌లో నని తెగించే యెక్కాడు. 'నభయం, నలజ్జా!'.... అంటే అర్థం వెనక చూస్తే వెనకేనోయ్ అని కదా.

అలా ముందు కెళిపోయి ఆమె కూచున్న చోటికి కొద్దిగా వెనగ్గా నుంచు న్నాడు మోహనరావు,

అంతరంటా ముందు కెళ్ళడానికి వీల్లేదు.

అక్కడంతా యితర స్త్రీలు.

వాళ్ళంతా ప్రస్తుతానికి పర స్త్రీలుగా అవుపించారు. ఎవరిమీదికీ చూపు వెళ్ళడంలేదు.

తన నెవరెలా చూస్తున్నదీ గమనిస్తున్నదీ పట్టింపుకి రాలేదసలు.

స్టాపు స్టాపుకీ వెనక్కి తిరిగి తనవేపు చూస్తూనే వుందామె.

'నేనున్నానా లేదా అని చూస్తోంది' అనుకున్నాడు.

ఆమె యెప్పుడు చూస్తుందా అని కళ్ళు అటేపే పెట్టి వుంచాడు. తను దిగిపోతే వెనకాతలే దిగిపోతుంది; అది గ్యారంటీ.

కాని— ఈ రూట్లో ఎక్కడ దిగీ లాభం లేదు. ఒంటరి స్నేహితుల రూములు లేవు. ఎరిగున్న లాడ్జీలూ లేవు.

ఆమె యెక్కడ దిగుతుందో అక్కడే తనూ దిగి, వీలుంటే కూడా వెళ్ళి పోవాలి. అదేతక్షణ కర్తవ్యం.

ఇంటి కెళ్తుంది కాబోలు- చేతిలో కూరల సజ్జ వుంది ఆమెకి. అదీ మంచిదే- 'సంసారపక్షంగా' వుంటుంది!

ఇల్లెక్కడో కనుక్కుంటే- యెందుకైనా మంచిది; ఎప్పటికైనా మంచిది!

ఆరు స్టాపులు దాటేక అయిదు సెకండ్లపాటు తన చూపులో చూపు కలిపి వుంచింది; నవ్వుతో ముగించిందాచూపుని.

అంటే— అంత సేపూ తనకా దృష్టి వుందా లేదా అని చూసి చూసి, ఆలోచించి, ఆ సుదీర్ఘ వీక్షణంలో ఇతను నా కోసమే వస్తున్నాడు అని రూఢి చేసుకుందన్నమాట—

అలా రూఢి చేసుకుందని తనకి తెలియడానికి, తన అంగీకారం తెలపడానికి నవ్వేందన్నమాట!

తరువాతి స్టాపులో తను దిగిపోతానన్నట్టుగా ఆమె కండక్టర్తో చెబుతోంది. అది రిక్వెస్టు స్టాపు. ఆపమని అడిగితే తప్ప ఆపరు.

తనకి తెలియాలని కూడా, ఎదర ఆపమని మరీ మరీ అంగికంచేసి చెబుతోంది.

"గైడా, భయపడకుము;
నేను నీ వెంటనే వున్నాను!"

అనుకుంటూ తరవాతి స్టాపులో దిగిపోడానికి బస్సులో జనాన్ని నెట్టుకుంటూ వెనక గేటు వరకు వొచ్చేశాడు మోహనరావు.

ఆ తోపుడులో ఆదుర్దాకి అనేకమంది హేళన చేసేరు; కోప్పడ్డారుకూడా, వొకరో యిద్దరోనూ.

ఏదీ లక్ష్యం చెయ్యలేదతను.

ఆతని 'లక్ష్య మే' వేరుకదా.

తోసుకుని గేటుదగ్గిరి కొచ్చేసరికి బస్సాగింది.

ఆమె చటుక్కున లేచి ముందునించి దిగడం గమనించి చకచకా దిగిపోయాడు మోహనరావు. దిగినవాళ్ళు యిద్దరే—

బస్సెళ్ళి పోయింది—

**అవరోహణ**

చిరునవ్వుతో ఆమెని సమీపించాడు మోహనరావు.

"మీ ఇల్లెక్కడండీ?" అనడిగిందామె.

"మా ఇల్లు— బర్కత్పురాలోనండి— అయినా ఇంట్లో బాగాలేదండి"

"బాగాలేకపోవడమేమిటి?" కళ్ళలోకి చూస్తూ అడిగింది, అసలేమీ అర్థం కానట్టే. ఆ ప్రశ్న అర్థం!

"దెబ్బ తినేసాను!" అనుకున్నాడు మోహనరావు.

ఆ ప్రతిపాదన తననించి రావాలని ఆమె ఎదురు చూస్తోందన్నమాట!– సహజమే కదా............ రెడ్డొచ్చినట్టయింది— మళ్ళీ మొదలెట్టాలి.

"టైమెంతైదండి; నా వాచీ ఆగిపోయింది."

'ఎనిమిదీ ఇరవై,' ఆమె వాచీచూసి చెప్పింది.

"మీ ఇల్లు ఇక్కడేనా?"

"ఔనండీ— ఎర్రంమంజిల్ కాలనీలో వుంటున్నాం. వస్తారా? మా వాళ్లేరు—.... నైట్ డ్యూటీ యివాళ"

"హాయ్, హాయ్! మంచి సమయం— నక్కని తొక్కి వొచ్చేను" అనుకున్నాడు మోహనరావు.

"ఇంకెవరుంటా రింట్లో?"

"పిల్లాడుంటాడు........ నాలుగో క్లాసు"

మెల్లిగా నడుస్తున్నారు. కాలనీ గేటు దాటి లోపలికొచ్చేరు.

"మీ యింటికి రావచ్చా?"

"రేపు పుదయం రాండి; నెంబరు—" చెప్పింది. "అప్పుడైతే ఆయనుంటారు."

కొంపదీసి తెలిసినవాళ్ళా యేమిటి? ఖంగుతిన్నాడు,

"ఇప్పుడోసారి వొచ్చి ఇల్లు చూసి వెళతాను. రేపు మళ్ళీ వస్తాను. పొద్దుట మళ్ళీ నెంబర్లు వెతుక్కోడం కష్టంకదా!"

"రేపంటే రేపొద్దుటే కాదనుకోండి- ఆదివారం అయితే ఆయనకి ఆఫ్— పూర్తిగా యింటిదగ్గిరే వుంటారు- నెంబరుంటే మా ఇల్లు సుళువుగానే కనిపెట్టొచ్చు. ఇక్కడ నెంబర్లు అంత అస్తవ్యస్తంగా వుండవ్."

"పోనీ మీ అబ్బాయిని వోసారి చూసి వెళ్తాను. ఎందుకో మీ ఇంటివరకు రావాలని నాకుంది. మీకేమో యిష్టం లేనట్టుంది. ఇంతదూరం తీసుకొచ్చి వెనక్కి పంపేడం అన్యాయం."

"ఇష్టం లేకపోడమేం? తప్పకుండా రండి." ఆమె నడక జోరు చేసింది.

అమ్మయ్య! కనికరించింది— ఇంక వీళ్ళింటి కెళ్ళేలోగా మరిన్ని మాటలు పొయ్యాలి!

"అప్పుడప్పుడు కనిపిస్తూనే వుంటారు మీరు, కాని మాటాడ్డానికి అవకాశం యివ్వలేదెప్పుడూనూ. ఇవాళ నా అదృష్టం బావుంది కనక నే నెక్కిన బస్సులోనే మీరూ యెక్కడం జరిగింది—" అన్నాడు.

ఆమె ఆగింది. అతనూ యాంత్రికంగా ఆగాడు.

"నే నెవరో గుర్తు పట్టేరా, అసలు మీరు?"

"మీరు— నేను— గుర్తు పట్టానుగాని—" నీళ్ళు నమిలాడు.

వాళ్ళిద్దరూ ఆగినచోట వున్న ఎలక్ట్రిక్ లైట్ కాంతిలో ఆమె కళ్లు కనబడ్డాయి. కాని కనిపించిందల్లా చూడగలిగే కళ్లు అతనికప్పుడు లేవు.

"నే నెవరో అనుకుని నావెమ్మట వచ్చేస్తున్నట్టుంది, మీరు. అయ్యో. రామ!" అని దీర్ఘం తీసిందామె.

"................"

"బస్సు ఎక్కేముందు, బస్సెక్కాక అప్పుడప్పుడూ నేను మీవేపు చూశానని అట్లా అనుకున్నారేమో........ పరీక్షగా చూసేవరకు నాకూ మీరెవరో గుర్తు రాలా."

"అలాగే మరి!"

"ఇప్పటికన్నా నేనెవరో మీకు గుర్తుకొచ్చానా?" దబాయించి అడిగింది.

తల అడ్డంగా ఆడించాడు; విధిలేక.

"నాలుగు నెలల కిందట మీరు ఏక్సిడెంటయి ఉస్మానియా ఆస్పత్రిలో చేరారా?"

"అవునండి, మీరక్కడ నర్సాండి?"

"నర్సూగాదు, ఆయాగాదు! నేనూ అప్పుడు ఉస్మానియాలో పేషెంటుగా జేరాను. నాకోసం రోజూ మావారు వచ్చేవారు. ఓరోజు రాత్రి డాక్టర్‌గారు నన్ను చూడ్డానికి లేటుగా వస్తే మావారు ఆయన్ని అడిగారు— ఏం సార్ లేటుగా వచ్చేరని." "పాపం వొక అబ్బాయి ఏక్సిడెంటై కేజువాల్టీలో అడ్మిట య్యాడు; అతనికి బ్లడ్ కావాల్సొచ్చింది; ఆ విషయంలో కొంచెం తర్జన భర్జన జరిగింది; హాస్పిటల్లో ఆగ్రూపుబ్లడ్ అసలు స్టాకులేకపోతే డోనర్లకి అర్జంటుగా కబురెట్టి రాడంవల్ల లేటైంది." అన్నారు డాక్టరుగారు. ఇంతకీ బ్లడ్ దొరికిందా అని మావారు ఆదుర్దాగా అడిగారు. దొరకడం కష్టం. ఈ రాత్రి 12 గంటల లోగా బ్లడ్ ఇవ్వకపోతే అతని పరిస్థితి ప్రమాదకరంగా తయారవ్వొచ్చు అని చెప్పారు డాక్టరుగారు. వెంటనే మావారు లేచి, పదండి. నా బ్లడ్ సరిపోతే యిస్తానని ఆఫర్ చేశారు. గ్రూపు సరిపోయింది. ఆయన మీకు వొక సీసా రక్తం యిచ్చి మిమ్మల్ని ప్రమాదంనుంచి తప్పించారు. మర్నాడు నేను కుతూ హలంకొద్దీ డాక్టరుగార్ని పర్మిషన్ అడిగి, మీ బెడ్ దగ్గరకొచ్చి అప్పుడే స్పృహ వస్తున్న మిమ్మల్ని పలకరించాను;—

"అదీ మన పరిచయం!"

మళ్లీ ఆమె కళ్లలోకి చూద్దామని ప్రయత్నించీకూడా,

తల లేవక—

దించిన మొహంలో లోతుకుపోయిన కళ్లలోకి సూటిగా పడుతున్న ఆమె కాళ్లనున్న మట్టెల కాంతి పరావర్తన కిరణాల ఘాటికి తట్టుకోలేక—

"థాంక్సండి: వస్తాను"— అని వచ్చినదార్నే వెళిపోయాడు మోహన రావు; తప్పంతా నాలో ప్రవహిస్తున్న ఆమె భర్త రక్తానిది" అని సమర్ధించు కుంటూ.

*